క్లుప్తంగా

వారం రోజులు 'భగీరథ' నీరు బంద్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో వారం రోజుల పాటు అంతరాయం ఏర్పాడనున్నట్లు మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా చేసే ఇంటేక్ వెల్ పూడిక తీత పనులు కారణంగా పట్టణంలో తాగునీటి సరఫరాలో మే 1 నుంచి 7వ తేదీ వరకు అంతరాయం ఏర్పాడుతుందని తెలిపారు. ప్రజలందరూ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మనుధర్మంతో అసమానతలు

అశ్వారావుపేటరూరల్: మనుధర్మం పేరుతో రోజు రోజుకూ సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని సీపీఐ (ఎంఎల్)మాస్లైన్ ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని పార్టీ కార్యాలయంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల సర్వసభ్య సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం పీఓడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఆయా సంఘాల బాధ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో నాయకులు బుచ్చిరాజు, గొంది లక్ష్మణరావు, కంగాల భూలక్ష్మి, అర్జున్, మల్లేష్, వీరమ్మ, గంగా పాల్గొన్నారు.

సింగరేణి వైద్యశిబిరం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట ప్రాథమిక పాఠశాలలో సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 105 మంది స్థానికులకు ఏరియా ఆస్పత్రి సీనియర్ వైద్యులు ఇన్నయ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది స్థానికులకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి భాస్కర్‌రావు, అనంత లక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది నాగసాయి, గ్రామపెద్దలు బిక్కసాని రవి, చీమల అంజిబాబు, ఈసల వెంకటేశ్వర్లు, చింతల దశరథ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సీపీఎం వినతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని నివాస ప్రాంతాల్లో కొద్ది రోజులుగా సీపీఐ చేపట్టిన సర్వేలో పలు సమస్యలు వెలుగులోకి రాగా.. ఆ సమస్యలను పరిష్కరించాల్సిందిగా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి మాట్లాడుతూ.. సుభాష్ నగర్ కాలనీ వద్ద కరకట్ట పునఃనిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పట్టణ వ్యాప్తంగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. అర్హులైనవారికే ఇందిరమ్మ ఇళ్లు దక్కేవిధంగా కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగా, కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకటరామారావు, పారేల్లి సంతోష్ కుమార్, డి.సీతాలక్ష్మి పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

చర్ల: దానవాయిపేట శివారులోని ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో నుంచి గ్రావెల్ తరలిస్తూ రెండు టిప్పర్లు పట్టుబడ్డ వ్యవహారంలో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని కోరుతూ మంగళవారం జీఎస్పీ ఆధ్వర్యంలో చర్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి ద్వాలియాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్పీ మండల అధ్యక్షుడు వరప్రసాద్ మాట్లాడుతూ.. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు తుర్రం రాజు, తుర్రం రవికుమార్ కంగాల అభిరామ్, సోడి రాజేష్ పాల్గొన్నారు.

పరశురామ జయంతి

బూర్గంపాడు: పరుశురాం పరివార్, విశ్వ హిందూ మహాసంఘ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సారపాక శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో పరుశురామ జయంతి ఆరాధన కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. పరుశురాం పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తవరపు రాజశేఖర్ మాట్లాడుతూ.. విష్ణుమూర్తి అవతారాలలో పరుశురామ అవతారం ఆరవదన్నారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి సాయికిరణ్, కరుకు ప్రసాద్, కల్యాణ్, హనుమంతు, బాలకృష్ణ, గోవర్ధన్, ప్రమీల, జయ, ఇందు, అనిత తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవం

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో తెలంగాణా జన సమితి (టీజేఎస్) 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణా ఉద్యమకారుడు, పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ నబీసాహెబ్ ఆధ్వర్యంలో పూసుగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రకమిటీ కార్యదర్శి మల్లెల రామనాథం, జిల్లా అధ్యక్షుడు బరగడ దేవదానం, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు హుస్సేన్, మండల అధ్యక్షుడు బుడగం నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కుడికాల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 22 అమలుపైనే ఆశలు

- వేతనాల పెంపునకు ఎదురుచూపులు
- ఎవరికీ పట్టని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల గోస
- నేడు కొత్తగూడెం ప్రధాన కార్యాలయం వద్ద దీక్ష


దీక్షను జయప్రదం చేయాలని కోరుతున్న కార్మికులు, నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం తమ వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ముక్త కంఠంతో కోరుతున్నాయి. అన్‌స్కిల్డ్ కార్మికుడికి మే 1 నుంచి రోజుకు వేతనం రూ.895 అమలు కావాలని తేల్చి చెబుతున్నాయి. ఈ మేరకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జాయింట్ యాక్షన్, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నేడు ఒక్క రోజు రిలే నిరాహార దీక్షకు సిద్ధమయ్యాయి. కొత్తగూడెం ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నాకు ఏర్పాట్లు చేశాయి. అన్ని యూనియన్లు దాదాపు 2వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తరలించనున్నాయి.

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ ఏరియాల్లో దాదాపు 30 విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 32వేల కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నారు. జీఓ నం.22 ప్రకారం తమకు వేతనాలు పెంచాలన్నది వీరి ప్రధాన డిమాండ్. కాని ఏళ్లు గడుస్తున్నా.. దీనిని పట్టించుకున్న నాథుడు లేదు.

ఆ జీఓల్లో ఏముంది?

2021 సంవత్సరంలో 5వ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లపై వేతన సలహా మండలిలో చర్చ జరిగింది. ఆ మేరకు తీర్మానం చేసి ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అదే సంవత్సరం జూన్ జీఓలు 21, 22, 23, 24, 25లను ఆమోదిస్తూ విడుదల చేసింది. వీటిల్లో జీఓ 22 కార్మికులకు మరింత లబ్ధి చేకూర్చే అంశం. విడుదల చేసిన ఆ ఐదు జీవోల ప్రకారం సెక్యూరిటీ సేవలు, రహదారులు, భవనాలు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ తదితర విభాగాల్లోని అన్‌స్కిల్డ్ కార్మికులకు 2021 ఏడాది నుంచే రోజుకు రూ.895 చొప్పున వేతనం అమలు కావాల్సి ఉంది. కానీ యాజమాన్యాల ఒత్తిడితో నాటి ప్రభుత్వం జీఓ ఆర్డర్లను గెజిట్ చేయలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయింది.

కాంగ్రెస్ హామీ ఏమైంది?

జీఓల నోటిఫికేషన్ నాటి నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల అమలు చేయండి లేదా జీఓ గెజిట్ చేయండి అంటూ సంఘాలు వాణి వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తమ ప్రభుత్వం ఏర్పడితే నెల రోజుల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా జీతాలను అమలు చేస్తామని ప్రకటించారు. 22 జీఓను గెజిట్ చేయిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచిపోయింది.. కానీ జీఓల అమలులో అతీగతి లేదు. అసెంబ్లీలో అనేక సందర్భాల్లో జీఓ 22పై చర్చ జరిగినప్పటికీ ఉపయోగం లేదు.

సీఎం మదిలో ఏముందో?

కాంట్రాక్ట్ కార్మికులకు మేలును చేకూర్చే జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లిస్తారని, ఈ మేరకు మే 1(రేపు) నాటికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారని రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉంది. దీనిని కార్మిక సంఘాలు స్వాగతిస్తున్నాయి. జీఓ 21, 22, 23, 24, 25లలో ఉన్న వేతనాలకు తగ్గకుండా.. వేతనాల డీఏ రేట్లు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే ఈ మే 1 సమీపించగా.. సీఎం ఎప్పుడు నిర్ణయాన్ని ప్రకటిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. తమ దీక్షతో అయినా.. శ్రామికుల దినోత్సవం రోజు వేతన పెంపు బహుమతిని అందిస్తారా అని కార్మికులు ఎదురుచుస్తున్నారు.

> **హామీని నిలబెట్టుకోవాలి..**
> కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జీతాలు పెంచాలి. జీఓ 22ను గెజిట్ చేసి అమలు చేయాలి. వెంటనే గెజిట్ చేయలేని పరిస్థితిలో జీవోల ప్రకారం తక్కువ ఇవ్వకుండా కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించేలా సింగరేణి చర్యలు తీసుకోవాలి.
> \- ఆర్.మధుసూదన్ రెడ్డి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు

మేడే కానుక ఇవ్వాలి


మణుగూరుటౌన్: జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

మణుగూరుటౌన్: మేడే కానుకగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం జీఓ 22 గెజిట్ అమలు చేయాలని కోరుతూ మంగళవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం దొంత వెంకట రామారావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాజర్‌పాషా మాట్లాడుతూ... ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే రోజు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ జీవో 22ను గెజిట్ చేసి అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికులకు శుభవార్త చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్, కార్మికులు గురుమూర్తి, నాగేశ్వరరావు, సంజీవరావు, వెంకటేశ్వర్లు, శ్రీను, కాంతారావు, చంద్రం, శ్రీనివాస్, రాముడు, లక్ష్మీనారాయణ, నాగమణి, ఎల్లమ్మ, సుందరం, రమాదేవి, రాజేశ్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ క్యాంటీన్‌లో తనిఖీ


క్యాంటీన్‌లో తనిఖీ చేస్తున్న డీఎం తిరుపతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో టిఫిన్ క్యాంటీన్లను మంగళవారం డిపో మేనేజర్ తిరుపతి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తానని, అదే విధంగా బస్టాండ్‌లో ఉన్న స్టాల్స్ నిర్వాహకులు కూడా ప్రయాణికుల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తే ఫైన్లు విధిస్తామని అన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

మణుగూరురూరల్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎయిడ్ డైరెక్టర్ పీఎస్ఎస్ హరిప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ నెల 30న అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్నందున.. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్(ఎయిడ్), యాక్సెస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రర్ వారి భాగస్వామ్యంతో రెండు రోజులుగా బాల్యవివాహాల నిర్మూలనపై దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు, ప్రతిజ్ఞలు చేయించినట్లు తెలిపారు. ఎయిడ్ మండల సీఏస్ ఎం.నాగుల జ్యోతి, పూజారులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'సీతారామ' నీరు అందించాలి


కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్ కాలువల నుంచి బూర్గంపాడు మండలంలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సీపీఎం ప్రతినిధి బృందం కోరింది. మంగళవారం బూర్గంపాడు రైతు వేదికకు వచ్చిన వారిని సీపీఎం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్ చెరువు, టేకులచెరువు, జకరయ్యచెరువు, మొద్దుల చెరువు, ఎల్లమ్మ చెరువులకు సీతారామ కాలువల నుంచి సాగునీరు విడుదల చేసి రైతులకు మేలు చేయాలని వారు కోరారు. వినతులపై కలెక్టర్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బినామీ కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక సొసైటీలపై బినామీ కాంట్రాక్టర్ల దోపిడిని అరికట్టాలని ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్య అన్నారు. స్థానిక ఐటీడీఏ ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బినామీ కాంట్రాక్టర్లు గిరిజన ఇసుక సొసైటీలను స్వాధీనం చేసుకుని, అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆదివాసీలను సమీకరించి ఆందోళను చేస్తామని ఆయన హెచ్చరించారు. పాయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ, ఇర్ప ప్రకాష్, గొగ్గల రామకృష్ణ, కొమరం శ్రీను, వినయ్‌కుమార్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడిపై నిరసన


బూర్గంపాడులో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్ ఉదంతంపై నిరసనలు భగ్గుమంటూనే ఉన్నాయి. మంగళవారం కూడా పలుచోట్ల ఉగ్రవాదదాడిని ఖండిస్తూ నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన భారతీయులకు నివాళులర్పించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు


మండల కేంద్రంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ, రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు కాగా డ్రెయినేజీ పనులు పూర్తి అయ్యాయి. రహదారి విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభించారు. ప్రధాన రహదారి ఏడు మీటర్లు ఉండగా ఇరువైపులా నాలుగు మీటర్ల చొప్పున ఎనిమిది మీటర్ల రహదారిని విస్తరించనున్నారు. దీంతో రహదారి 15 మీటర్లు వెడల్పు కానుంది. మధ్యలో మీటరు వెడల్పుతో డివైడర్లు ఏర్పాటు చేయనున్నారు. విస్తరణలో భాగంగా సుమారు 15 విద్యుత్ స్తంభాలు తొలగించనున్నారు. ఇందుకు సంబంధించి రూ.5.60 లక్షలతో విద్యుత్ శాఖ అధికారులు ఆర్అండ్‌బీ అధికారులకు అంచనాలు పంపారు. ఆర్అండ్‌బీ అధికారులు డబ్బులు చెల్లించాల్సి ఉంది.

అర్హులైన వారందరికీ లబ్ధి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు

చండ్రుగొండ: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజీవ్ యువ వికాస్ పథకం లబ్ధి చేకూరుతుందని మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకానికి 1862 మంది దరఖాస్తులు చేసుకున్నారని, అందులో తొలివిడతగా 500 మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి, ఎస్‌బీఐ మేనేజర్ రవి పాల్గొన్నారు.

చెరువు మరమ్మతులకు భూమిపూజ

ములకలపల్లి: ఇందిరమ్మ చెరువుల బాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కొత్త గంగారం, పూసుగూడెం శివార్లలోని చెరువుల మరమ్మతు పనులకు మంగళవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భూమిపూజ చేశారు. తొలుత ములకలపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐబీ ఈఈ సురేశ్, డీఈ మోతీలాల్, ఏఈలు సురేశ్‌కుమార్, వరప్రసాద్, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, కారం సుధీర్, బాల అప్పారావు, కొప్పుల రాంబాబు, మడకం చిరుమప్ప, కరుటూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండాల తహసీల్దార్‌గా రాజారావు



గుండాల: గుండాల నూతన తహసీల్దార్‌గా కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం నుంచి వచ్చిన రాజారావు మంగళవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఇమ్మానుయేల్ మణుగూరు బదిలీ కాగా.. ఆయన స్థానంలో కొత్తగా ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ట్రాఫిక్ ఎస్ఐగా తిరుపతి



భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా తిరుపతి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

ఇటీవల జిల్లాలో గత శనివారం జరిగిన బదిలీల్లో ఇప్పటి వరకు భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ పనిచేసిన మధుప్రసాద్‌ను అశ్వాపురం ఎస్ఐగా.. అశ్వాపురం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తిరుపతిరావు భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ గా బదిలీ అయ్యారు.

గట్లపై మొక్కలు నాటాలి

ములకలపల్లి: పొలం గట్లపై జామాయిల్ మొక్కలు నాటడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని ఐటీసీ ప్లాంటేషన్ ఏరియా మేనేజర్ జితేందర్‌కుమార్ అన్నారు. జగన్నాథపురంలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీసీ ఆధ్వర్యంలో గట్లపై మొక్కలు నాటేందుకు ఎకరానికి 200 మొక్కలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. జామాయిల్ సాగు చేసే రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ కృష్ణారావు, శ్రీధర్, ప్రశాంత్, స్థానిక రైతులు ఆడపా నాగేశ్వరరావు, నాగు, ఈర్ల రామ్మోహన్‌రావు, పామర్తి చందర్ రావు, కృష్ణ, అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.

నూతన రేషన్‌కార్డు అందజేత

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారుడికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ నూతన రేషన్ కార్డును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే అర్హులైన నిరుపేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల సురేష్, ఎండి.రహీంపాషా, అప్పన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై గరంగరం

'లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు'

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యంగా సాగుతోందని, జాబితాలో అక్రమాలకు పాల్పడుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డి.సలీం ఆరోపించారు. మంగళవారం అశ్వారావుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి, అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపికలో పేదలకు అవకాశం ఇవ్వడం లేదని, అనర్హులైన వారికి జాబితాలో చోటు కల్పిస్తున్నట్లు వాపోయారు. తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్నిన రామకృష్ణ, ఎన్ విజయకాంత్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తుల వసూళ్లు..

భద్రాచలంటౌన్: ఇళ్ల మంజూరులో మధ్యవర్తులు ముడుపులు సేకరిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుని అర్హులైన వారికే కేటాయించాలని ఏవీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు దొర కోరారు. అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఏవీఎస్పీ ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల్లో అర్హులైన ఆదివాసీ నిరుపేద బడుగు బలహీన వర్గాల వారికి మొదటిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోరం మురళి, సోందె శ్రీరాములు, పీసోడి వసంతరావు, బాలరాజు, వెంకటేశ్వరావు, కొర్రి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అనర్హులకు కేటాయించారు..

ములకలపల్లి: మండల పరిధిలోని మాధారం జీపీ పరిధిలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ గద్దె రేవతికి ఫిర్యాదు చేశారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలకమిటీ సభ్యులు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, చనగాని వినోద్; ముదిగొండ వెంకన్న, ముదిగొండ రవికుమార్, వెంకమ్మ, వాణి పాల్గొన్నారు.

దత్తత గ్రామానికి ఇళ్లేవి?

చండ్రుగొండ: తమకూ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండని మండలంలోని ఎమ్మెల్యే జారె దత్తత గ్రామం మహ్మద్‌నగర్ వాసులు కోరారు. ఈ మేరకు గ్రామంలోని మహిళలు మంగళవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. దాదాపు అందరూ పేదలే ఉన్న ఈ గ్రామానికి ఇళ్లు మంజూరు చేయాల్సింగా విజ్ఞప్తి చేశారు.

లబ్ధిదారుల సర్వే అడ్డగింత


సర్వే అధికారితో గిరిజనుల వాగ్వాదం..

అశ్వారావుపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను మంగళవారం నారాయణపురం పంచాయతీ వాసులు అడ్డుకున్నారు. సర్వే అధికారులు ఏఓ శివరాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరీతోపాటు సిబ్బంది కలిసి ఇళ్ల జాబితాను పంచాయతీ కార్యాలయం వద్ద పరిశీలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ పరిధిలోని నారాయణపురం, నెమలిపేట, పెంచికలపాడు, సూర్యంపేట, జగన్నాథపురం గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర పేదలు అక్కడికి వచ్చి సర్వే అధికారులను పేదల పేర్లు లేవని, పట్టా భూములు, ఇళ్లు ఉన్న వారికి జాబితాలో చోటు దక్కిందని నిలదీశారు. దీంతో పంచాయతీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే సర్వే చేపట్టాలని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

ఇళ్లొస్తాయ్.. ఆందోళన వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

చండ్రుగొండ: అర్హులందరికీ దశలవారిగా ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 30 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.8.68 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, పేదలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రజాపాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, వివిధ శాఖాధికారులతోపాటు కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, యండి.ఇమ్రాన్, ఫజల్‌బక్ష్మి, కిరణ్‌రెడ్డి, బొర్రా సురేష్ పాల్గొన్నారు.